
సాక్షి వనపర్తి
బుధవారం ၊ 25 ၊ డిసెంబర్ ၊ 2024



ఆశలు పదిలం
కోయిల్‌సాగర్ ఆయకట్టుకు బుధవారం నుంచి సాగునీటిని విడుదల చేయనున్నారు.
వివరాలు 10లో ▸



ముగిసిన లీగ్ మ్యాచ్‌లు
కోస్గిలో జరుగుతున్న జాతీయస్థాయి వాలీబాల్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.1 / 18.5
చలి తీవ్రత కాస్త పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. చల్లటి గాలులు వీస్తాయి.

హక్కులను విస్మరించొద్దు



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు


వనపర్తి: వినియోగదారులు తమ హక్కులను విస్మరించొద్దని అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పౌరసరఫరాలశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారులు డిజిటల్ సేవలపై అవగాహన పెంచుకోవాలని.. ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. అదేవిధంగా వర్చువల్ హియరింగ్‌తో సకాలంలో సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ కాశీ విశ్వనాథ్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి..

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లులకు తరలించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం చిన్నంబావి మండలంలోని పెద్దదగడ, అమ్మాయిపల్లిలో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, తేమ, తాలు, చెత్త లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

క్రిస్మస్‌కు ముస్తాబు





జిల్లాకేంద్రంలోని కల్వరి టౌన్ చర్చి

వనపర్తిటౌన్: క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. జిల్లాలోని అన్ని చర్చీలను ముందురోజే రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కల్వరి టౌన్, ఒలియె ఎంబీ చర్చిలు విద్యుత్ దీపాల వెలుగుల్లో కనిపించాయి. క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేసి అలకరించారు. మంగళవారం రాత్రి జిల్లాకేంద్రంలోని చేయూత అనాథ ఆశ్రమం, వృద్ధాశ్రమంలో పీడీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రీస్తు సందేశం వినిపించి చిన్నారులు, వృద్ధులకు భోజనం అందించారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మొత్తం 182 మంది రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయించుకోగా 27 మందికి మధుమేహం, 10 మందికి రక్తపోటు ఉన్నట్లు నిర్ధారణ అయింది. 113 మంది ఎక్స్‌రే తీయించుకోగా ముగ్గురు టీబీ అనుమానిత కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌ఓ డా. ఎ.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో డా. సాయినాథ్‌రెడ్డి, డీపీఆర్వో సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి..

మహిళా సమాఖ్య సభ్యులు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకొని ఆర్థికంగా స్థిరపడాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో సుమారు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేయనుందని.. పురపాలికలు, మండల కేంద్రాలు, గ్రామాలనే తేడా లేకుండా ఇళ్ల నిర్మాణం చేయాల్సి ఉన్నందున ఇటుకల తయారీ యూనిట్ల ఏర్పాటుకు యువత, మహిళలు ముందుకు రావాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను సిమెంట్ లేదా బూడిదతో తయారు చేసిన ఇటుకలను ఉపయోగించేందుకు అనుమతించిందని.. ప్రతి మండలంలో కనీసం 3 సిమెంట్ ఇటుకల యూనిట్లు నెలకొల్పేందుకు అవకాశం ఉందని, ఆసక్తిగల వారు డీఆర్డీఓను సంప్రదించాలని సూచించారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

పెబ్బేరు రూరల్: పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ డా. అల్లె శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి జనరల్ ఓపీ, ప్రసవాలు, ఇన్ పేషెంట్ రిజిస్టర్లు, వైద్యసిబ్బంది హాజరుపట్టిక తనిఖీ చేశారు. అదేవిధంగా ఫార్మసీ రూంలో మందులు, వ్యాక్సిన్లను కూడా పరిశీలించారు. ఆస్పత్రిలో సిబ్బంది తక్కువగా ఉన్నారని.. త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. ఆయన వెంట మండల వైద్యాధికారి డా. రాకేష్‌రెడ్డి, శ్రీహరినాథ్‌రెడ్డి, ఆరోగ్య సహాయకుడు రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ పార్వతి, ఫార్మాసిస్ట్ కుమారి, రాజేష్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తినుబండారాల్లో నాణ్యత తప్పనిసరి



వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీధర్మా

వనపర్తి టౌన్: బస్టాండ్‌లో విక్రయించే తినుబండారాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చర్యలు ఉంటాయని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీధర్మా హెచ్చరించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో విక్రయిస్తున్న తినుబండారాల ప్యాకెట్లపై ఉన్న గడువు, నాణ్యత, ఎంత ధరలకు విక్రయిస్తున్నారనే విషయాలను యజమానులు, ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నుంచి వనపర్తికి రాత్రి 11 గంటలకు బస్సు నడపాలని ప్రయాణికులు కోరగా రద్దీ తక్కువగా ఉండటంతో 10 వరకే నడుపుతున్నామని, సమయం పెంచే ప్రసక్తి లేదని డిపో మేనేజర్ వేణుగోపాల్ బదులిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ సంస్థ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను డీఎంకు వివరించారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

చెరుకు రవాణా ఆంక్షలు ఎత్తివేయాలి



సీఐ శివకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న చెరుకు రైతుల సంఘం నాయకులు

ఆత్మకూర్: చెరుకు పంటను కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి తరలించేందుకు రవాణాపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపీ మంగళవారం సీఐ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జీఎస్ గోపీ మాట్లాడుతూ.. అమరచింత, ఆత్మకూర్ రైతులు ట్రాక్టర్లు, లారీల్లో నిత్యం వందల సంఖ్యలో చెరుకును ఫ్యాక్టరీకి తరలిస్తున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వాహనాలను మదనాపురం, ఆత్మకూర్‌లో రాత్రి వరకు పోలీసులు నిలిపివేస్తున్నారని చెప్పారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. సమయపాలన ఆంక్షలు ఎత్తివేసి నిరంతరం తరలించేలా అనుమతి ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు వెంకటేశ్, దేవస్వామి, అరుణ్‌కుమార్, అంజి, మోహన్ తదితరులు ఉన్నారు.

జిల్లా ముఖచిత్రం క్యాలెండర్ ఆవిష్కరణ



వనపర్తి విద్యావిభాగం: అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూపొందించిన వనపర్తి జిల్లా ముఖచిత్రం క్యాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు క్యాలెండర్‌ను రూపొందించిన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం వనపర్తి జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు గంధం భరత్, బీసీ నాయకులు గౌనికాడి యాదయ్య, నాయకులు బొడ్డుపల్లి సతీష్‌కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

వనపర్తి రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు వైద్య కళాశాలకు భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లకు అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్‌ఓసీలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని.. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ధ్రువపత్రాలు అందజేయాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ బాధిత రైతులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకేంద్రం సమీపంలోని మర్రికుంట, నాగవరం శివారులోని సర్వేనంబర్లు 200, 86లో ఉన్న 170 ఎకరాల భూమిని 200 కుటుంబాలు ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగించేవన్నారు. గత ప్రభుత్వం రైతులతో ఒప్పందం చేసుకొని వైద్య కళాశాల తదితర ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకుని బాధిత రైతులకు 1,081 ప్లాట్లను కేటాయించిందని తెలిపారు. వాటికి ఎన్‌ఓసీలు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని.. ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రత్యేక చొరవచూపి ధ్రువపత్రాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, రైతులు రాములు, తిరుపతినాయక్, చంద్రానాయక్, రాజశేఖర్, అశోక్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్, సిబ్బందికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఆయన హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధులను నిర్లక్ష్యం చేసినందుకు హాస్టల్ వార్డెన్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు మరోమారు చోటు చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం


రామస్వామి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. జిల్లాకేంద్రానికి చెందిన రామస్వామి (45) ఎస్పీ వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తుండేవాడు. మంగళవారం బైక్‌పై వెళ్తూ జిల్లాకేంద్రంలోని ఓ రెస్టారెంట్ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రామస్వామికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి


ట్రాక్టర్ కింద మహేష్ మృతదేహం

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌లో ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన శివ, మహేష్ (18) కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం ట్రాక్టర్‌తో దున్నడానికి వెళ్లాడు. మరోరైతు పొలంలోకి వెళ్లే క్రమంలో ప్రమాదశావత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. శివ ప్రాణాలతో బయటపడగా.. మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మహేష్ నాగర్‌కర్నూల్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండేవాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హన్వాడలో చెరువులో పడి..


బైకని నవీన్ (ఫైల్)

హన్వాడ: మండల కేంద్రానికి చెందిన బైకని నవీన్‌కుమార్ (17) మృతదేహం మంగళవారం స్థానిక పెద్ద చెరువులో కనిపించింది. అటుగా వెళ్లిన వారు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. నవీన్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటూ ఉదయం వేళ పేపర్‌బాయ్‌గా పనిచేస్తుండేవాడు. నవీన్ ఆత్మహత్య చేసుకున్నాడా.. ఎవరైన గొడవపడి ఇలా చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హన్వాడ పోలీసులు శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తండ్రి బైకని రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ఎద్దులబండి కిందపడి చిన్నారి..

తాడూరు: ఎద్దులబండి చక్రాల కిందపడి ఓ చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని ఇంద్రకల్‌లో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలస్వామి, చెన్నమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఝాన్సీ, హన్సిక (6) ఉన్నారు. తల్లిదండ్రులతో కలిసి ఎద్దుల బండిపై పొలానికి వెళ్తుండగా.. బండి చక్రాలు రాళ్లపై ఎక్కడంతో అదుపుతప్పింది. దీంతో పట్టు కోల్పోయిన హన్సిక కిందపడగా పైనుంచి చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

ఆశలు పదిలం

నేటి నుంచి కోయిల్‌సాగర్ నీటి విడుదల

- యాసంగి పంటలకు అందనున్న సాగునీరు
- షెడ్యూల్ ఖరారు చేసిన అధికారులు
- ఊసులేని పాత కొత్త ఆయకట్టు..
- సిద్ధమైన నారుమళ్లు..
- ప్రస్తుతం 31.6 అడుగుల నీటిమట్టం


మరికల్ శివారులో సిద్ధంగా నారుమడి


కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

దేవరకద్ర/మరికల్: కోయిల్‌సాగర్ ప్రాజెక్టుపై రైతుల ఆశలు పదిలం అయ్యాయి. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన సాగునీటి సలహా మండలి సమావేశంలో బుధవారం నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 15 వరకు విడతల వారిగా నీటిని విడుదల చేయాలని షెడ్యూల్ ఖరారు చేశారు. దీంతో యాసంగి పంటలకు సాగునీరు అందుతుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 31.6 అడుగుల మేర నీటి నిల్వ ఉంది.

పాత ఆయకట్టుకే..

యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా పాత ఆయకట్టుకు నీటిని వదులుతారు. వానాకాలంలో మూడు నెలల పాటు నిరంతరం నీటిని వదలడంతోపాటు తీలేరు, ఉంద్యాల వద్ద లింక్ కెనాల్స్ ద్వారా సాగుకు నీటిని అందించారు. అలాగే గొలుసు కట్టు చెరువులను నింపి పంటలకు నీటిని వదలడంతో పాత ఆయకట్టుతోపాటు అదనపు ఆయకట్టు కలుపుకొని దాదాపు 35 వేల ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ప్రాజెక్టులో ఉన్న నీటితోనే పంటలకు నీటిని వదలడం వల్ల కేవలం పాత ఆయకట్టు దేవరకద్ర, కౌకుంట్ల, కుడి కాల్వ కింద ధన్వాడ, మరికల్, చిన్నచింతకుంట మండలాల పరిధిలోని 12 వేల ఎకరాలకే సాగునీరు అందే అవకాశం ఉంటుంది. అది కూడా విడతల వారిగా మధ్యలో విరామం ఇస్తూ ఐదు తడులుగా నీటిని వదులుతారు. దీంతో ప్రాజెక్టులో ఉన్న రెండు టీఎంసీల నీటిలో ఒక టీఎంసీని పంటలకు, మరో టీఎంసీ నీటిని తాగునీటికి ఉపయోగిస్తారు.

నీటి విడుదల షెడ్యూల్ ఇలా..


తడులు	నీటి విడుదల తేదీలు	తడి రోజులు
మొదటిది	25.12.2024 - 8.1.2025	15
రెండోది	24.1.2025 - 31.1.2025	8
మూడోది	13.2.2025- 20.2.2025	8
నాలుగోది	5.3.2025 - 13.3.2025	9
ఐదోది	25.3.2025 - 3.4.2025	10

నీటిని వృథా చేయొద్దు



ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో 31.6 అడుగుల నీటి మట్టం ఉంది. యాసంగి సీజన్‌లో పాత ఆయకట్టు కింద ఉన్న భూములకే సాగునీటిని అందిస్తాం. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 3 వరకు 5 విడతల్లో నీటిని వదులుతాం. 50 రోజులు నీటి విడుదల, 50 రోజులు విరామం ఉంటుంది. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రతాప్‌సింగ్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఈఈ


కోయిల్‌సాగర్ కుడి కాల్వ ద్వారా వస్తున్న సాగునీరు (ఫైల్)

మరమ్మతు చేయాలి..



నీటిని వదలడానికి ముందే పిల్ల కాల్వల్లో పేరుకు పోయిన గడ్డి, ముళ్ల చెట్లను తొలగించాలి. కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చూడాలి. లేకుంటే నీరంతా కాల్వల ద్వారా కాకుండా పొలాల్లో పారుతుంది. దీని వల్ల నీటి వృథా ఎక్కువ అవుతుంది. అధికారులు పిల్ల కాల్వలపై దృష్టిసారించి.. మరమ్మతు చేపట్టాలి.

– రవీందర్‌రెడ్డి, రైతు, నాగారం, దేవరకద్ర మండలం

కొత్త ఆయకట్టు చేర్చాలి..



కోయిల్‌సాగర్ కింద తీసిన కొత్త ఆయకట్టుకు కూడా సాగునీరు అందించాలి. ఇందుకోసం కొత్తగా తీసిన లింక్ కెనాల్‌కు తూములు ఏర్పాటు చేసి పిల్ల కాల్వల ద్వారా పంటలకు సాగు నీరు అందిస్తే యాసంగిలో వరి సాగు చేస్తాం. వర్షాకాలంలో మాత్రమే కేవలం కోయిల్‌సాగర్ లిఫ్టు నుంచి కొత్త ఆయకట్టు కోసం తీసిన ప్రధాన కాల్వలకు నీళ్లు వస్తున్నాయి. యాసంగిలో చుక్కనీరు రావడం లేదు.

– రాములు, రైతు, మరికల్

చివరి ఆయకట్టుకు అందించాలి..



యాసంగి సీజన్‌లో నీటిని చివరి ఆయకట్టు వరకు అందించాలి. కుడి కాల్వలో నీటిని వదిలి తర్వాత చివరి ఆయకట్టుకు తక్కువగా వస్తుంది. కొన్నిసార్లు నీరు రాక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చివరి ఆయకట్టుకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలి. నీటిని వదిలిన సమయంలో కాల్వపై అధికారులు పర్యవేక్షణ చేయాలి.

– రమేష్, రైతు, నెల్లికొండి, చిన్నచింతకుంట మండలం

చివరి వరకు నీరు చేరడం లేదు

యాసంగిలో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేసే సాగునీరు చివరి ఆయకట్టు వరకు రావడం లేదు. దీంతో వేసవిలో పంటలకు నీరు అందక ఎండుముఖం పట్టిన సందర్భాలు ఉన్నాయి. పంటలు కోతకు వచ్చే సమయంలో నీళ్లు లేక దిగుబడులు తగ్గి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది. చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సింది ఎంతైన ఉంది.

– మల్లేష్, పెద్దచింతకుంట

పంప్‌మోడ్ పద్ధతిలో 2,632 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 24 గంటల వ్యవధిలో 2,632 క్యూసెక్కుల నీటిని(ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,630, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 245, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.063 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. మంగళవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 862.3 అడుగుల వద్ద 113.2228 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 1,262 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 90 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 493 క్యూసెక్కులు, కుడి కాల్వకు 285 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 195 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 27 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 1,713 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 8.241 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లంను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి మండలంలోని హాజీపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నల్లబెల్లం సరఫరా చేస్తున్న కారును ఆపి తనిఖీచేయగా డ్రైవర్ పరారయ్యాడు. కారులో ఉన్న 16బస్తాల నల్లబెల్లం, 50కిలోల పటిక, 6లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మిఠాయి దుకాణంలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

- మహిళ పరిస్థితి విషమం
- ట్రాక్టర్ డ్రైవర్ మైనర్‌గా గుర్తింపు


సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పట్టణ శిక్షణ ఎస్ఐ తారక

గద్వాల క్రైం: అనుమతి లేకుండా మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ మిఠాయి దుకాణంలోకి దూసుకెళ్లగా నిద్రిస్తున్న భార్యభర్తలను ఢీకొట్టగా మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన గద్వాల పట్టణంలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. బీసీ కాలనీకి చెందిన సరోజమ్మ, దౌలన్నలు గద్వాల చిన్న జాతర సందర్భంగా భీం నగర్ రోడ్డు మార్గంలో మిఠాయి అంగడి ఏర్పాటు చేశారు. అయితే నది ఆగ్రహారానికి చెందిన మట్టి వ్యాపారి అర్ధరాత్రి నుంచి అనుమతి లేకుండా వజ్రాల గుట్ట నుంచి జేసీబీ సహాయంతో మట్టిని ట్రాక్టర్ల ద్వారా గద్వాల వైపు తరలిస్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారు జామున మట్టితో ట్రాక్టర్‌ను మైనర్ యువకుడు భీం నగర్ మీదుగా తీసుకొస్తున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో మిఠాయి అంగడిలోకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. ఈ క్రమంలో అంగడిలో నిద్రిస్తున్న భార్యభర్తలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సరోజమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ట్రాక్టర్ నడిపిన మైనర్ యువకుడిని, ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నదిగ్రహారానికి చెందిన మట్టి వ్యాపారి ప్రభుత్వ భూముల నుంచి జేసీబీ సహాయంతో ఐదు ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ట్రాక్టర్లు మైనర్లు నడుపుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు వివరించారు. సదరు మట్టి వ్యాపారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉమామహేశ్వర రిజర్వాయర్ పనులు నిలిపివేయాలి


అనంతవరం వద్ద మహిళా రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐలు రమాదేవి, ఇందిరమ్మ


బల్మూర్ నుంచి బైక్‌లపై కలెక్టరేట్‌కు వెళ్తున్న భూ నిర్వాసితులు

బల్మూర్: తమకు జీవనాధారమైన భూముల్లో రిజర్వాయర్, కాల్వల నిర్మాణాలకు సర్వే పనులు నిలిపే వరకు పోరాటం ఆగదని ఉమామహేశ్వర ప్రాజెక్టు భూ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంతో పాటు అనంతవరం, మైలారం శివారులో వారం రోజులుగా కొనసాగుతున్న సర్వే పనులు వెంటనే నిలిపి వేయాలంటూ మంగళవారం బల్మూరు రైతులు కలెక్టరేట్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించి కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం ఇవ్వడానికి తరలివెళ్లారు. మరోవైపు అనంతవరం సమీపంలో రాంపూర్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ పనుల సర్వేను ఆ గ్రామానికి చెందిన రైతులు అడ్డుకున్నారు. దీనిపై చర్చించేందుకు ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడాలని ఏఈఈ ధీరజ్ రైతులకు వివరించడంతో వారు అచ్చంపేటకు తరలివెళ్లారు. ఎస్ఐ రమాదేవి తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏదేమైనా రైతులతో చర్చించకుండా పొలాల్లో సర్వేలు చేపట్టడం సరికాదని మండిపడుతున్నారు. ప్రాజెక్టు గ్రామాలకు దూరంగా నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినా సర్వే పనులు గ్రామాల మీదుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీపీఆర్ లేకుండానే సర్వే పనులు ఎలా చేస్తారని రైతులు ప్రశించారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం


రవినాయక్(ఫైల్)

వెల్దంద: పశువుల షెడ్‌లో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తిమ్మినోనిపల్లి పరిధిలోని రాచూర్ తండాకు చెందిన మూడావత్ రవినాయక్(45) ఉదయం9గంటలకు భోజనం చేసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. పశువుల షెడ్‌లో రవినాయక్ ఉరేసుకున్న విషయం సమీప పొలం రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. రవినాయక్‌కు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు.

ముగిసిన వాలీబాల్ లీగ్ మ్యాచ్‌లు


మూడోరోజు పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

- ప్రీ క్వార్టర్స్‌కు చేరిన 16 జట్లు

కోస్గి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి అండర్–19 బాలుర వాలీబాల్ పోటీల్లో భాగంగా మంగళవారంతో లీగ్ మ్యాచ్‌లు మొత్తం ముగిశాయి. 21 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలు, 7 కేంద్ర విద్యా సంస్థలకు చెందిన 32 జట్ల మధ్య మూడు రోజులుగా హోరాహోరీగా కొనసాగిన పోటీల్లో 16 జట్లు విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాయి. మిగిలిన రెండు రోజుల్లో క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి.


ఉత్తరప్రదేశ్- చత్తీస్‌ఘడ్ జట్ల మధ్య పోరు

హోరాహోరీ పోటీల్లో..

మంగళవారం మూడోరోజు వాలీబాల్ హోరాహోరీ పోటీల్లో 16 జట్లు విజేతలుగా నిలిచి ప్రీ క్వార్టర్స్‌కు చేరాయి. మంగళవారం పోటీల్లో పాల్గొన్న జట్లు, విజేతలైన జట్ల వివరాలు పరిశీలిస్తే.. గుజరాత్ జట్టు సీబీఎస్ఈ వెల్ఫేర్ జట్టుపై 25- 11, 25- 18 స్కోర్‌తో గెలుపొందింది. ఉత్తరప్రదేశ్ జట్టు జమ్ము కాశ్మీర్‌పై 25- 17, 25- 15 స్కోర్‌తో, తమిళనాడు జట్టు ఢిల్లీపై 26- 24, 15- 9 స్కోర్‌తో, కర్ణాటక జట్టు తెలంగాణపై 25- 20, 25- 21 స్కోర్‌తో, హరియాణా జట్టు ఆంధ్రప్రదేశ్‌పై 17- 25, 25- 21, 15- 9 స్కోర్‌తో, దాద్రనగర్ హవేలి జట్టు ఐపీఎస్‌సీపై 25- 23, 15- 25, 15- 10 స్కోర్‌తో, రాజస్థాన్ జట్టు సీఐఎస్‌సీఈపై 25- 21, 25- 14 స్కోర్‌తో, కేరళ జట్టు ఐబీఎస్ఓపై 25- 2, 25- 2 స్కోర్‌తో, ఒడిశా జట్టు ఎన్‌వీఎస్‌పై 25- 5, 25- 14 స్కోర్‌తో, పంజాబ్ జట్టు చండీఘర్‌పై 25- 13, 25- 17 స్కోర్‌తో, ఉత్తరాఖండ్ జట్టు విద్యాభారతిపై 25- 19, 25- 15 స్కోర్‌తో, మహారాష్ట్ర జట్టు బిహార్‌పై 25- 15, 25- 13 స్కోర్‌తో, హిమాచల్‌ప్రదేశ్ జట్టు జార్ఖండ్‌పై 25- 14, 25- 13 స్కోర్‌తో, పుదుచ్చేరి జట్టు లక్షద్వీప్‌పై 25- 22, 25- 18 స్కోర్‌తో, చత్తీస్‌ఘడ్ జట్టు పశ్చిమ బెంగాల్‌పై 19- 25, 25- 11, 16- 14 స్కోర్‌తో, సీబీఎస్ఈ జట్టు మధ్యప్రదేశ్ జట్టుపై 25- 20, 25- 19 స్కోర్‌తో విజయం సాధించాయి.

రాతి గోడపై.. టమాట



సాధారణంగా టమాట చెట్లు తోటల్లో, ఇంటి పెరట్లో, అక్కడక్కడ పెంటకుప్పల్లో పెరుగుతాయి. కానీ, ఇక్కడ మాత్రం రావి చెట్టును తీసిపోని విధంగా ఓ టమాట మొక్క ఇంటి రాతి గోడపై మొలవడమే కాకుండా ఏకంగా కాయలు సైతం కాశాయి. అమరచింతలోని వడ్ల శేషయ్య ఇంటి వెనక రాతిగోడపై కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. – అమరచింత

తాళం వేసిన ఇళ్లే లక్ష్యం

- హల్‌చల్ చేస్తున్న దొంగలు
- రూరల్ పరిధిలో వరుస ఘటనలు


ఖిల్లాఘనపురంలో బంగారు దుకాణంలో ఫింగర్ ప్రింట్ సేకరిస్తున్న క్లూస్‌టీం

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. కొందరు ముఠాగా తిరిగితే.. మరికొందరు ఒంటరిగా చోరీలకు పాల్పడుతున్నారు. పాలమూరు పట్టణంలో హల్‌చల్ చేస్తున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. లక్ష్మీనగర్ కాలనీలో వరుసగా జరిగిన ఘటనలు మరవకముందే మళ్లీ తాజాగా ఆదివారం అర్ధరాత్రి పద్మావతి కాలనీలో ఓ ఇంట్లో ముగ్గురు దొంగలు దొంగతనానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన ఆ ఇంటి యాజమాని, ఇతర కుటుంబ సభ్యులు ఇంటికి తాళమేసి పట్టణంలో ఉన్న బంధువుల ఇంటికెళ్లారు. అర్ధరాత్రి ముగ్గురు యువకులు ముసుగులు వేసుకుని ఇనుపరాడ్లతో ఇంటి కాంపౌండ్‌లో నుంచి ఇంట్లోకి ప్రవేశించారు. తలుపులు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ఇంటి బయట కట్టివేసిన జర్మన్ షఫడ్ కుక్క దొంగలపైకి తిరగబడి దాడి చేయడానికి ప్రయత్నం చేయగా వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈదృశ్యాలు ఇంటి ఆరుబయట ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఘటన స్థలాన్ని పరిశీలించామని, ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు తేలిందని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

బంగారు దుకాణంలో చోరీ

ఖిల్లాఘనపురం: తాళం వేసి ఉన్న ఓ బంగారు దుకాణంలో చోరీ జరిగిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాలు.. ఖిల్లాఘనపురంలోని రావిచెట్టు ప్రాంతంలోస్వర్ణకారుడు నారాయణదాసు వెంకటేష్‌చారి బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం ఆయన తన సోదరుడు శివకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో దుకాణానికి తాళం వేసి మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 8గంటలకు ఆయన దుకాణం వద్దకు వెళ్లాడు. దుకాణం తాళం విరగొట్టి ఉండటంతో తలుపులు తెరిచి చూశాడు. దుకాణంలో ఉన్న 14గ్రాముల బంగారు, 615 గ్రాముల వెండి ఆభరణాలు దొంగలు అపహరించినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన ఎస్ఐ సురేష్‌గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్లు సేకరించిందని, ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో దొంగ బీభత్సం

- మధ్యాహ్న భోజనం సరుకులు, కంప్యూటర్ చోరీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచర్ల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు పగులగొట్టి విద్యార్థుల మధ్యాహ్న భోజనం సరుకులను, కంప్యూటర్‌ను ఎత్తుకెళ్లారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపిన వివరాలు.. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్నం భోజనం తయారు చేసే వంట గది తాళాలను సోమవారం రాత్రి పగలగొట్టి సిలిండర్, బియ్యం, కుక్కర్, గుడ్లు, కందిపప్పు, నూనెతో పాటు వంట సామగ్రి దోచుకెళ్లారు. జెడ్పీహెచ్ఎస్‌లోని కంప్యూటర్ మానిటర్‌ను ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయాన్నే చూసిన గ్రామస్తులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారమిచ్చారు. వారు పాఠశాలలకు చేరుకొని ఎంఈఓ, డీఈఓలకు సమాచారమిచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.